


సీతని హాస్పిటల్లో చేర్పించినరోజే తల్లికి వాంతులు మొదలెట్టాయి. కొత్తగా వచ్చిన గుమాస్తాగారి మరదలు నర్సుకోర్సు చదువుతోందిట. ఆవాటాల్లో కాపరంఉన్నవాళ్ళకి కొన్నాళ్ళకి సరిపడ్డమాటలు దొరికాయి.

"వున్నావా! రామలక్ష్మీ" అంటూ ఆదెమ్మగారు నూతిపక్కనించి కేక పెట్టింది.

"ఏమి వినేందుకు తీరి కెక్కడిది: చూస్తూనే వున్నారుగా—చంటాడికి రోగాలు ఇంకా వెనకెట్టనేలేదు; మళ్ళా నిన్నటి నించీ తిండి ఇవడటంలేదు. ఆపిల్ల ఐనా ఇంట్లో వుంటే, ఏవో చిన్నపన్లే అను కోండి. అందుకునేది; దాన్నికాస్తా తీసు కెళ్ళి ఆస్పత్రిలో పడేశారు. మీ తమ్ముడి నిర్వాకం ఇల్లావుంది. ఇంతకీ మీరు చెప్పే మాట విన్నేలేదు. ఏమిటి అంటారు?" అంటూ రామలక్ష్మి నూతి దగ్గరకి వచ్చింది.

"ఆఁ, ఏంలేదు. ఎంత మరదలైతే మాత్రం ఒక్కరిషా ఎక్కుతారటమ్మా: అయినా ఆ అప్ప వనాలిలెదూ. వీధిదాకా వచ్చి ఆబక్కవెధవచేత ఏమిటో, టూ టానో, టా టీనో చెప్పిస్తుంది. నాకు తిట్టు కాలేసుకొచ్చి విన్న అడిగేశా— ఆయనకి ఏమి అవుతుందా పిల్ల అని.

"నాతో మాట్లాడం నామర్దా అనుకుంది కాబోలు భళ్ళుని తలుపేసుకుంది నిన్న. ఈరోజు కరివేపాకుది వస్తే వాకిట్లోకి వెళ్ళా. ముగ్గురూ నన్నుచూసి పళ్ళికిలిస్తు న్నారు. అసహ్యం వేసింది అనుకో. ఛీ, అని తలుపేసుకున్నా. ఇంతకీ సీతకి ఏం సుస్తీట? ఐనా పెళ్ళీడుపిల్లకి పెళ్ళి చెయ్యాలి కాని తగదునమ్మ అంటూ ఆసుపత్రులంట తిప్పి. రోగిష్టిదన్న పేరు పడితే ఎవడైనా చేసుకునేందుకు ముందుకి వస్తాడంటావా? నీకు తెలవదా ఏమిటి కన్నదానివి? మొగాడు చెప్పిన మాట వినకపోతే నువ్వుమాత్రం ఏం చేస్తావులే; ఏమో సుమా! మీ ఆయన తత్వం నా కేం నచ్చలేదు. మీ బాబుగారు కూడా నొచ్చుకున్నారు. ఏదో పిల్లబాగల వాళ్ళుకదా అని వోసంబంధం చెప్పా రుట. ఆ బాపతువి ఇంకెప్పుడూ చెప్పద్దు అని మొహం చిట్లించాడుట పదిమంది లోనూ. ఏమి బాగుంటుంది చెప్పు?"

"నాతో మాటకైనా అనలేదు పిన్ని గారు! ఆయనమటుకు జమీందారు అనుకుంటారు. ఎన్ని సంబంధాలు వచ్చినా తప్పిస్తూ వచ్చారు. అప్పుడే రేపు శ్రావణానికి ఇరవై వస్తుంది. ఇదో కుంపటిలా వుంది నా ప్రాణానికి," అంటూ కళ్ళు వత్తుకుంది రామలక్ష్మి.

"పోన్లే, మాటవరసకి అన్నాకాని కష్ట పెట్టుకోక. టైమ్ వస్తేకాకేంచేస్తుందిలే," అంటూ ఆదెమ్మ మాట మార్చుకు వెళ్ళింది.

రామలక్ష్మి పుట్టింటారికి భూవసతి వుండటం, అదీ పల్లెటూర్లో అవటంవల్ల డాబుసరిగా కుటుంబాన్ని నెట్టుకొస్తు న్నారు. రామలక్ష్మికి ఏటా గుంటూరు చీరలు జరీవి ఏ బాపతైనా వో నాలుగు ముట్టచెప్పటం మామూలు. దారిలో అప్పగారి ఇంటికి తప్పకుండా

వెళ్ళటం, అమ్మమ్మే అప్ప అత్త అవటం చేత మరో చీర ముడుతూనేవుంది.

చూసేవాళ్ళకి చీరలు, వినేవాళ్ళకి మాటలతోటి రామలక్ష్మి పుట్టింటారు జమీందార్లన్న వూహ నిల్చేటట్టు చేసుకు, మనస్సుని తృప్తిపర్చుకునేది. 'ఆరోజు కుటుంబయ్య హాస్పిటల్ నించి వస్తూనే రామలక్ష్మి పై విసుక్కున్నాడు. "నీ షోకులు నీవేతిప్ప పిల్లసంగతి కనుక్కుంటేగా: గుండె బలహీనంగా వుందిట, సీతకి" అంటూ మాసిన గుడ్డ కుర్చీలో నడుం వాల్చాడు.

రామలక్ష్మిలో ఆవేశం ఆకాశంలో అమావాస్యనాటి నక్షత్రాల్లా వెలిగింది. కుటుంబయ్య కుటుంబాన్ని తిట్టింది. వట్టి నూనెదివిటీల్లాంటి కుటుంబం అంది. తనకి అన్నీ ఇచ్చాడు దేముడు, కానీ, అదృష్టాన్ని తక్కువచేశాడు. లేకపోతే తన అందానికీ, తెలివికీ, ఏ జమీందార్ల ఇంట్లోనో వుండాల్సిన పుట్టుక. తండ్రిని తిట్టుకుంది. సంతానాన్ని తిట్టింది. సీతని తిట్టింది. అలిసిపోయి మడతమంచం పైన వాలింది.

ఆటల కెళ్ళిన ఆరుగురు సంతానం కాకుల్లాఅరుస్తూ ఆవురావురంటూ వసారా లోకి దూకారు. కుటుంబయ్య మనస్సు బాధగావుంది. పిల్లల్లో పెద్దది కామేశ్వరి. దానికి రామలక్ష్మి పుట్టింటివేపు పోలికే కాదు గుణాలుకూడా అంతే. బతుకుతెరువు తెల్సినపిల్ల — మహాగడసరి. సీత అల్లా కాదు — వట్టి జాలిగుండె. తనకి లేక పోయినా తల్లికీ మిగిలినవాళ్ళకీ లేవని బాధపడుతుంది.

సీత అంటే తనకి అభిమానమనే రామలక్ష్మికి కోపం. అల్లా అని వొప్పు కోదు పైకి. సీతని చూస్తే తన పోయిన చెల్లెలు జ్ఞాపకంవస్తుంది. దానిలాగే అవదుకదా అనిపించింది. దీపాలవేళ అల్లా ఆలోచించినందుకు లెంపలేసుకు పెరట్లోకి వెళ్ళి కాళ్లు కడుక్కుని దేముడు ఇంట్లోకి వెళ్ళాడు. మకిలిపట్టిన పటాల వెనక వెలవెల్లాడే దేముళ్ళకి స్తిమితం లేని మనస్సుతో మొక్కుకున్నాడు. పసివాడి ఏడుపుకి చెవుల్లోంచి హోరు వచ్చింది. రెక్కుచ్చుకు కంచంముందు కూలేశాడు.

రామలక్ష్మి నల్ల మబ్బులమధ్య ప్రళయతాండవం చేసే వురుముకి తోడు వచ్చిన మెరుపులా వాలింది. గిన్నెలు దొర్లాయి. గరిటెలు మూల కొకటి నడి చాయి. లాంతరు చిమ్నీ పగిలింది. పసి వాళ్ళు భయంతో బిగుసుకు ఆకలి మరిచారు. కుటుంబరావు చిరుచీకటిలో చిన్న అరుగుమీద పొట్లంలా ఇమిడి కూర్చున్నాడు.

పొద్దుపోయింది. పసివాళ్లు భయం విడిచి మాటుమణిగారు. ఆకలీ, నిద్రా, అల్లరీ—అంతే వాళ్ళకితెల్సు. కాలం వూరు కోదు—పెంచి పెద్దవాళ్లనిచేస్తుంది. బాధలు, తిప్పలు, కోరికల్ని కొండల్లా పెంచి

ఇస్తుంది. అసమర్థుడైన తండ్రిని చూపిస్తుంది తల్లి. తండ్రిమీదకసి, తల్లి అంటే జాలి ఈపిల్లలికి కలుగుతుంది. కాని తన సీతకి అర్భకుడైన తండ్రి అంటే జాలి. 'ఎందుకు నాన్నా బాధపడతావు' అని తనే కళ్ళు వత్తుకుంటుంది.

అప్పు చేసైనాసరే సీతని బతికించుకోవాలి. తనతల్లి పేరు, సీతకి—ఆయుస్సికి లోపం రాకూడదు అనుకుని మూలిగే మనస్సుని వోదార్చాడు.

మధ్యతరగతి కుటుంబాల్లో ప్రణయాలు, ప్రళయాలు, రేపటి ఖర్చులు నెమరుకివస్తే నీరసించి నిద్దరోతాయి. రామలక్ష్మిలో ఆవేశం కలిగింది. 'పెద్దాడికి జీతం కట్టాలిట రేపు,' అంటూ గడపవతల నిల్చుని పొడిగా పలికింది కుటుంబయ్యతో.

'మధ్యతరగతి వాళ్ళక్కూడా నిద్ర వస్తుందికనకే జనాభా పెరుగుతోంది. లేకపోతే సగంమంది పిచ్చివాళ్ళే అవుతారు' అన్న కుటుంబరావు మాట రామలక్ష్మి వినిపించుకోలేదు.

మేనేజరు కూతురు పెళ్ళి శుభలేక గుర్తుకివచ్చింది. ముడుపు చెల్లించాలి. వెంటనే ధరకట్టుకుంటాడు.

వాడిదగ్గర లోకువైతే వాడి విషపు చూపు భరించాలి. వాడినోటికి హద్దుల్లేవు. కిందవాళ్ళని కొరుక్కుతింటాడు. చిత్రం, పైవాళ్ళనోళ్ళు కట్టేస్తాడు — పులిలాంటి వాడు వస్తే ఏం? వీడివల్లో ఇట్టే చిక్కుకుంటాడు. చిత్తం, చిత్తం అంటూ వినయం వలకపోస్తూంటే వాళ్ళు కనుక్కోరుఎందుకనో; రామలక్ష్మి ఏంటూనే నిద్దరోయింది. కుటుంబరావు మేనేజరు అవతారాన్ని మరిపించుకునేందుకు చాలా గంటలుకొట్టాయి. మూడుకొట్టాక బుఱ్ఱ మొద్దుబారి నిద్దరట్టింది.

పొద్దున్నే కొత్తకంఠాలు గలగలలాడాయి. ప్రకాశం, వీధిచివర వుంటే ఇంట్లో వున్నంతకంఠం — పిల్లలంతా లేచారు. వాకిట్లో చుట్టాలు, ఇంట్లో పిల్లలు, పెరట్లో కాకులు. సగం తెరచిన కళ్ళతో కుటుంబరావు కునుకుతున్నాడు.

కామేశ్వరి ఇల్లంతా వోచుట్టు తిరిగింది. తల్లి దగ్గర మంతనాలాడింది. తండ్రిని లేపింది. విషయాలు గుక్కపట్టినట్టు చెప్పేసి పక్కింటి ఆదెమ్మగారి ఇంట్లోకి తొంగిచూసి, వార్తలు తెల్సుకుంది. వెళ్ళినంత వేగంగా వచ్చి, 'అదేమిటే! సీతని ఆసుపత్రిలో పెట్టారా!' ఆశ్చర్యపడింది.

“అసలు ఈ పెళ్ళికొడుక్కేగా మన సీతని ఇమ్మంటా. మీ మేనేజరు పట్టేశాడు. కట్నంలేదుట — వట్టి డబక్కులుగాడులా వున్నాడే? పెళ్ళికొడుకు తల్లి వహాటేగోల — 'ఏ ముద్దూ లేకుండా ఈ పెళ్ళేమిటి' అని. నాన్న, మరోచిత్రం విన్నావా, ఎంతోమంది అందమైనవాళ్ళని చూపెడితే నచ్చలేదని వెళ్ళగొట్టేవాడుట. అల్లాంటిది ఈపిల్ల ఫొటో చూసి వప్పేసు



కున్నాడుట చిత్రంగా లేదూ?" అని ఆశ్చర్యంగా మొహంపెట్టి కామేశ్వరి వోషణం మాటలు నిలిపింది.

కామేశ్వరిభర్త మాటకారి కాక పోయినా ఆకారం మంచిదే. కామయ్య గదిలోకి రాగానే వెల్తురు వాకిట్లోకి తప్పు కుంది. ప్రకాశం బదుగుశరీరంలో అంత కంఠాన్నీ ఇముడ్చుకున్నట్లు, కామయ్య శరీరంలో కంఠము క్షీణించింది.

రామలక్ష్మి వంటింటి గుమ్మంలోంచే అల్లుడు కామయ్యనీ, తమ్ముడు ప్రకాశాన్నీ పలకరించిచది.

తమ్ముడు సీమటపాకాయలా సమాధానాలు చెపుతున్నాడు.

కోడు విరిగిన కుర్చీ గోడకి బోటెట్టి మూలగా కూర్చున్నాడు కామయ్య.

చాలా సేపటికి తన మేనేజరింట్లో పెళ్ళికే వీళ్లు వచ్చినట్టు తెల్సుకోగలిగాడు

కుటుంబయ్య. ఈసారి ఊపిరి తేలిగ్గా వచ్చింది. తనే కాకుండా తనవాళ్లుకూడా ఏదో ముట్టచెపుతారు. ఈసారి నాలుగు డబ్బులు దొరికే వూరికి తను అడిగి వేయించుకోవచ్చు కేంపు. తనకి పాపిష్టి డబ్బుమీద మక్కువలేదు. సీతకి మంచి మందు ఇప్పించాలి. మంచి వరుణ్ణి తేవాలి. దానిఈడు పిల్లలు కలకల లాడుతూ కాపరాలు చేస్తూంటే తన సీత పెదిమ కదపకుండా ఇంటిడు చాకిరీ చేసి వళ్ళు పాడుచేసుకుంది. ఈసారి కుటుంబయ్యకి తలతిరిగినట్లు అయ్యింది.

ప్రకాశం చదివింపుకని తెచ్చిన వెండి గ్లాసు ఇంటిల్లిపాదికి చూపెట్టాడు. తరవాత పెరట్లోంచి వాటాల్లో వాళ్ళ దగ్గరకి పంపాడు. అంతా మెచ్చుకుని గ్లాసుని ఇంటికి చేర్చారు. కామేశ్వరి గంధముగిన్నె బయటపెట్టింది. పోటీకి రామలక్ష్మి తనదగ్గర కొత్త కుంకం బరిణె వుంది అంటూ తెచ్చింది

ఈసారి ప్రకాశం అప్పగారికి సలహా ఇచ్చాడు. 'కామేశ్వరిని కుంకంకాయ ఇమ్మని నువ్వాం గంధంపుడక ఇస్తే బాగుంటుంది.'

'పోనీ నీ గ్లాసు అమ్మకీ, ఆవిడ భరిణె నువ్వూ ఇవ్వరాదూ' అంటూ కామేశ్వరి మూతి విరిచింది. 'తప్పకుండా ఇచ్చేవాడినే. కాని నేను కొన్నట్టు పెళ్ళివారి అందరికీ ముందే తెలిసింది,' అని ప్రకాశం అమ్మగారితో కష్టం సుఖం మాట్లాడేందుకు రహస్యమందిరంలాంటి రేకుల గదిలోకి వెళ్ళారు.

ప్రకాశం అనుకున్నంతా చేశాడు.

ముహూర్తం అవగానే మొదటి చదివింపు తనదే అన్నంత ధీమాగా పేరు మైకులో మోగించాడు. కామేశ్వరి తెచ్చింది కుటుంబయ్య పేరుకి మారింది. కామయ్యపేరు చివరికి మిగిలినవాళ్ళ మధ్య వినపడింది.

కామేశ్వరి ఇంటికివచ్చి మేనమామని దుమ్మెత్తిపోసింది. పందిట్లో వదిమంది దాకా తను తెచ్చినది భలానా అని చెప్పింది.

ప్రకాశం చేసినపనికి ఎవరూ మెచ్చలేదు. పైగా కుటుంబయ్య చిక్కుల్లో పడ్డాడు. తోటిగుమాస్తాలు సూటీపోటీగా, 'అవున్లే, మమ్మల్నివద్దనినువ్వు గొప్పగా ఇవ్వాలని వెండిది చదివించావు. వాడి తెలివే వాడిదిరా; అని ఆ శాస్త్రిగాడు అప్పుడే గోలెట్టాడు,' అంటూ ముందూ వెనకా మాట్లాడారు. మేనేజరు పక్కకి పిల్చి చివాట్లు: 'అసలే నీకేదో చేసేస్తున్నానని వాళ్ళేడుస్తోంటే నువ్వీ చదివింపేమిటి; ఏమైనా ఆలోచనుందా; అలా అని వందలా, వేలా,' అంటూ మెల్లిమెల్లిగా బైటపడ్డాడు.

'ఇంటిముఖం పట్టిన కుటుంబయ్య తన కోటుకేసి చూసుకున్నాడు. సర్వీసులో చేరిన్నాడు కొత్తది తొడుక్కున్నాడు. బోలెడు సర్వీసు వుంది. తూట్లు పడింది.

అందంగా రఫ్ తీయించాడు. మేనేజరుకి తెలీదు. వందల్ని ఆ కోటు ఇంక మొయ్యలేదు. ఇంటివసారాలో అడుగు పెట్టాడు. తల్లీకూతుళ్ళు ఘర్షణపడుతున్నారు. రామలక్ష్మి విసురుగా వచ్చింది. 'ఆ గంధంగిన్నె ధరకట్టి దానికి ఇచ్చెయ్యండి. పిల్లలచేతకూడా దెప్పించుకున్న జన్మ వుంటే ఏం, లేకపోతే ఏం?' కుటుంబరావుకి తన్నే అన్నట్టు అనిపించింది. 'మీ తమ్ముడికి ఇల్లాంటి పెద్దరికాలు వద్దని చెప్పరాదు.' ప్రకాశం, రామలక్ష్మి ఏకమై కుటుంబయ్యని వీధిన పెట్టారు. ప్రకాశం కోపం కామేశ్వరి మీదకి మళ్ళింది. 'మిడుకుతున్నావు; ఈ మామయ్యే లేకపోతే ఆనాడు నీపెళ్ళి అయ్యేదేనా: ఈపాటికి ఏతు...' అంత కోపంలోనూ కామేశ్వరి మేనమామ నోటికి అడ్డంపడి మాట్లాడవద్దని సైగ చేసి, కాళ్ళావేళ్ళాపడి, కామయ్య్యి వినకుండా మరపించింది. 'పక్కింటి గుమ్మాన్ని అతుక్కుని వింటూన్న ఆదెమ్మకి కొన్ని లొసుకులు అర్థమైనట్లే తోచి మాయమయ్యాయి.

ప్రకాశం ఆరోజే తిరుగుప్రయాణం పెట్టాడు. రామలక్ష్మి బతిమాలింది. సీతని చూసి వెళ్ళమంది. తన్నీదిక్కుమాలిన కొంపలో వేశారు అని తీరిగ్గా సోకాలెట్టింది. చివరి అస్త్రం బాగా వుపయోగపడింది. ఆసాయంత్రం తమ్ముడిని పిల్చుకు హాస్పటాలు కెళ్ళింది కామేశ్వరి. కామయ్యకూడా వెంటపడ్డారు.

సీతని చూసేందుకు తల్లి రావటం అదే మొదలు; తండ్రి రోజూవస్తాడు, దిగులుపడతాడు; కష్టాలు చెప్పుకుంటాడు. తండ్రికోసం చూసే సీతకి తల్లీ, అప్పా, వెనక మేనమామా కనుపించారు.

'నాన్న ఏరీ' అన్న అమాయకపు ప్రశ్నకి రామలక్ష్మిలో ఈర్ష్య కలిగింది. 'ఏం మప్పితంగా తిని కూర్చుంటోంది. ఆ తండ్రిదగ్గర గారాలు పోతుందిలే! పళ్ళు పలహారాలు తెచ్చి అందిస్తున్నట్టున్నాడు' అని పెద్దకూతురికి చెప్పుకుంది.

సీత మనస్సు మనుష్యులకోసం పరితపిస్తోంది. మేనమామని వాటేసుకు ఎన్నో ప్రశ్నలు వేసింది. కామయ్య రావటం చూసి ఎదురువెళ్ళి పలకరించింది. ప్రకాశంలో వ్యవహారదక్షత జారి, సీతమీద జాలిగా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఎదటిగదిలోకి వెళ్ళే పెద్దమనిషిని నిలిపి ఫలానా అని చెప్పుకున్నాడు. ముందుకెళ్ళిన ముసలాయన వెనక్కి వచ్చి ప్రకాశాన్ని కౌగిలించుకు పైగుడ్డతో కళ్ళు వొత్తుకుంటూ తన గోడు చెప్పుకున్నాడు. ఆ ముసలాయన్ని సీత మంచందగ్గరకి పిల్చుకొచ్చాడు. 'ఆనాడు చెప్పినది ఈ పిల్లేనండీ' అంటూ ప్రకాశం ఆప్యాయంగా సీతకేసి చూసుకున్నాడు.

'రూమ్ నెం. 22.' అంటూ నర్సులు హడావిడిగా తిరుగుతున్నారు.

ముసలాయన మొహాన్ని పట్టిన చెమట తుడుచుకుంటూ ప్రకాశం చెయ్యి పట్టుకు గదికేసి నడిచాడు. '22 నెం. బి. లో వున్న అతనికి బాగాలేదుట' అంటూ ఆయా వార్త వార్డులో మోగింది. కామేశ్వరి ముసలాయన కొడుకుని చూసింది, ప్రశ్నలు వేసింది. అతని భార్యని పలకరించింది. వినేట్లు 'పొగరెక్కువే వుందే' అంది.

పక్కగదిలోకి చూసింది. చూసి నిల్చింది. నిల్చి ముసుకులవాళ్ళని తోసుకు ముందుకు వెళ్ళింది. హుస్సేనుఆలీ తల్లిని పలకరించింది.

మంచాన్ని పట్టిన హుస్సేనుకేసి దిగులుగా చూసింది. ఏమిటి సుస్తీ ? సమాధానంగా హుస్సేను పాలిపోయిన పెదిమలు కదిలాయి. జీవుడు కళ్ళల్లోకి చేరింది. తెలివిగా తిరిగాయి. పరిసరాలు విభ్రాంతితో చూశాయి. కామేశ్వరి కళ్లు వెదికాయి. హుస్సేనుకు కామేశ్వరిని గుర్తుచేసింది తల్లి ముంతాజ్. కామేశ్వరి మంచానికి దగ్గరగా జరిగింది. పాలిపోయిన చెయ్యి, దుప్పటి ఇవతలికి జరిగింది.

హుస్సేను కళ్ళు ఎటో చూస్తూ నిల్చాయి. డాక్టరు వచ్చాడు. హాస్పిటల్ భాషలో సీరియస్ కేస్. నర్సు వచ్చి దుప్పటిలో మనిషిని దాచింది. బురకాల్లో శబ్దంలేకుండా రోదనలు. మరో మంచం దగ్గరకి డాక్టరు వెళ్ళిపోయారు.

కామేశ్వరి, ముంతాజ్ దుఃఖాన్ని పంచుకున్నట్లు, కళ్లు వాచాయి. ప్రకాశం కామేశ్వర్ని రమ్మని పిల్చాడు. 'హుస్సేనుకి కొడుకు పుట్టాడు. కొడుక్కాడు, సైతాన్' అంటూ గట్టిగా అరచి పడిపోయిన ముంతాజ్ని కామేశ్వరి పట్టుకుంది. బురకాఆమె ముంతాజ్ని బైటకి తీసుకెళ్ళింది.

ప్రకాశం, కామయ్య చూడకుండా, కామేశ్వరిని పళ్లుకొరుకుతూ చూశాడు.

కామేశ్వరి పక్కమంచాల్ని ఆనుకు నిల్చుని ప్రకాశాన్ని లెక్కచెయ్యకుండా, హుస్సేను చిన్నప్పుడు ఎంత అందమైన వాడో వర్ణించింది. మంచివాడు అంటోంది. రామలక్ష్మి 'టైమ్ ఐంది,' అంటూ కామేశ్వరిని తీసుకు కదిలింది. ప్రకాశానికి సీతని వదలి వెళ్ళబుద్ధి పుట్టలేదు. కామయ్యా సీతకి తగ్గిపోతుందని ధైర్యం చెప్పాడు.

22 నెం. గదిలోంచి ఆడవాళ్ళు వచ్చారు. మామయ్యకేసి అనుమానంగా చూశారు. సన్నటి నల్లటిఆమె చొరవ చేసి 'ఆ ముసలాయన మీకు ఎల్లా తెల్సు' అని నిలేసింది. ప్రకాశం ఆవేశంగా తన పరిచయాన్ని పెంచి ఘనంగా చెప్పుకున్నాడు. 'ఈ పిల్ల నా మేనకోడలే; అసలు దీన్నే ఇవ్వాలనుకున్నాము' అని చెప్పేసి తేలిగ్గా వూపిరితీసుకున్నాడు.

పచ్చగా బొద్దుగా వున్న ఆమె పెద్ద కళ్ళల్లో నీళ్ళు నిండాయి. అలా జరిగినా బాగుండేవాడేమో!

నల్లటావిడ కోపంతో పళ్ళుకొరికింది. 'నీ కెందుకే దుఃఖం – ఒక్కనాడు సుఖ పడ్డావా; వున్నావొకటే లేకపోయినా వొకటే. ఈ ముసలాడే దీనికి కారణ మండీ. మాచెల్లెకి వక్కతేపిల్ల. మొన్నల్లా చేరి దాని మనసు విరిచి, పెళ్ళి అయ్యేదాకా ఏమి ప్రేమ వలకపోశాడో అంతే.'

'అయ్యాక ఇహ చూడండి అన్నట్టు. డబ్బుకోసరం తప్పితే మరి మాటలేదను కోండి. అసలు పిల్లాడే అప్రయోజకుడు అంటాను. ఈరోజుల్లో తండ్రి మాట వినే చవట ఎవడంట,' అని ఆయాస పడింది. ఎఱ్ఱటావిడ కళ్ళు ఎఱ్ఱపడ్డాయి. 'అమ్మాయిని చేసుకుంటే బాగానే వుండే వాళ్ళేమో!' అనటంతో మొహంలో క్రోధం తిరిగింది. పెద్దకళ్ళకేసి చూసేం దుకు భయమేసింది ప్రకాశానికి.

అనుభవంలేని సీత అమాయకంగా 'ఐపోయిన సంగతులు ఎందుకట్టా? పైగా జబ్బుతో మంచాన పడ్డవాళ్ళమీద కోప మేమిటి? ముందు బలం పట్టేటట్టు మందు ఇప్పించండి. మళ్ళీ తగూలెట్టుకోండి. మళ్ళీ జబ్బుచేస్తుంది,' అంటూ గుక్క పట్టినట్టు నవ్వింది.

ప్రకాశం అంత నవ్వకూడదంటూ సీతని సముదాయించి గుండె సవరించి వెళ్ళిపోయాడు.

గంటలు కొట్టి, వచ్చినవాళ్ళని హెచ్చ రించి పంపేశాడు. మళ్ళీ నిశ్శబ్దం చీకటితో కలిసి వార్డుల్లో తిరుగుతోంది.

అక్కడో సిస్టర్, అక్కడోసిస్టర్ కదుల్తూ వుంటారు. ఆ రోజు సీతకి ఇంటికి వెళ్ళిపోవాలనిపించింది. మామ య్యతో చెపితే బాగుండేది. ఆరోజు అప్పుడే ఇద్దరుపోయారు. పక్క మంచం ఖాళీగావుంది. తను వంటరిగా ఎల్లాగు పడుకోవడం? ఈరోజు సిస్టర్ ఆనంద్ రాదు కాబోలు. ఈ సిస్టర్ నిర్మలకి తగని చిరాకు. చీకటిలాగే దిగులు పెరుగుతోంది. కిటికీ అవతల చిన్న నక్షత్రం మిణుకు మిణుకు మంటూ కదులుతోంది. కిటికీదగ్గరకెళ్ళి నిల్చుంది. దూరంగా పార్కులో ఎవరో కొట్లాడు తున్నారు. మనుష్యులు తిరగనిరోడ్లు వెడల్పుగా పెరిగినట్లు కనబడుతున్నాయి. మళ్ళీ మనస్సు ఇంటికి వెళ్ళింది. పాపం అమ్మే చేసుకోవాలి. అక్క వున్నా పని చెయ్యదు. చంటాడికి అన్నం సరీగ్గా పెడుతోందో లేదో. నాన్న ఎంతో చిక్కి పోయాడు. అన్నీ తల్చుకుంటే దుఃఖం వచ్చింది. గుండెల్లో బరువుగా వుంది. మళ్ళా మంచందగ్గరకి వెళ్ళింది. వార్డు చివర బెడ్డుదగ్గిర హౌసావిడి పడుతు న్నారు. సిస్టర్స్ జోక్సు వదులుతు న్నారు. 'ఈ రోజు ఎన్ని టికెట్లో పుచ్చు కుంటూంటా?' డాక్టర్ వచ్చాడు; వెళ్లాడు. ముసలావిడ దీనంగా సిస్టర్సు దగ్గరికి తిరుగుతోంది. ఇంటికి కబురు చెయ్యాలి అంటే ఏమిటని అందర్నీ అడుగుతోంది.

తన వంటరితనాన్ని వదిలి సీత

ముసలావిడతో వెళ్ళింది. ఈ వారంలో ఎన్నో చూసి నేర్చుకుంది. బాధపడే వాళ్ళని వోదార్చేది. రక్తం ఎంత సేపు ఎక్కుతుందో చూసేది. సెలైన్ సీసా ఖాళీ అయ్యేముందు సిస్టరుకి చెప్పేది. తన టికెట్ బుక్ అడిగి చూసుకునేది. ఎప్పుడూ జుట్టు రేగకుండా, బట్ట నలగకుండా చూసుకుంటోంది. బైటవాళ్లకి ఫోన్ చెయ్యాలంటే కిందకి వెళ్ళాలి. ముసలావిడ కొడుక్కి చెయ్యాలంటుంది. వాళ్ళకి లేదుట, వాళ్ళ చుట్టుపక్కలా లేదుట! ఏం చెయ్యటం బోధపడలేదు.

సీత సలహా చెప్పింది; వార్డుబాయిని పిల్చి బతిమాలి, ముట్టచెప్పి ఎవర్నో పంపమంది.

ముసలావిడ సీతని మెచ్చుకుంది, సిస్టర్ నిర్మల సీతని కోప్పడింది. లేచి తిరక్కూడదని కసిరింది.

ఈసారి సీతకి దుఃఖం వచ్చింది. కీనీడని కూర్చుని కళ్ళు వొత్తుకుంది. హాస్పేసు ఖాళీ చేసిన బెడ్‌కి ఎవర్నో తీసుకువచ్చి చేర్పించారు. మళ్ళీ సందడి పెరిగింది. ఎవరో పెద్దవాళ్ళు వచ్చినట్టు చాలామంది సిస్టర్లు వచ్చారు. డాక్టర్లు వస్తున్నారు. దీపాలు వెలిగాయి. సీత మొహంమ్మీద దీపం పడుతోంది. వచ్చే పోయేవాళ్ళని చూస్తూ పడుకుంది. ఏదో తెల్సిన మొహం కదిలింది–పోల్చుకునేందుకు – ఏలూరు రైలుగట్టు పక్క పచ్చ మేడ గుర్తుకి వచ్చింది, చింత చెట్టుకింద పెంకుటిల్లు – అమ్మకి పురుడు – అమ్మమ్మ రావటం–నాన్నని కోప్పడటం – ఎందుకో తెలీకపోయినా నాన్న రెండురోజులు ఇంటికి రాకపోతే తనకి జ్వరం రావటం – అన్నీ గుర్తుకి వచ్చాయి. ముందు పేరు గుర్తుకిరాలేదు. మామయ్యగా రబ్బాయి – ఇప్పుడు గుర్తువచ్చింది. నారాయణ – అప్పుడుకూడా బొద్దుగానే వుండేవాడు. తనకి రోజూ పువ్వులు కోసిఇచ్చేవాడు. వాళ్ళదొడ్లో విశాఖపట్నం సంపెంగ వుండేది. ఎన్నో పువ్వులు పూసేది.

పెంకుటిల్లుకూడా వాళ్ళదేట! నాన్నతోటి అద్దె ఇచ్చేందుకు వెళ్ళినరోజే వాళ్ల అబ్బాయి నారాయణ పువ్వులిచ్చాడు. నాలుగేళ్లు – రోజూ ఇవ్వటం, తను తీస్కుకోవటం – మధ్యలో కోప్పడేవాడు, జడ పట్టుకు గుంజటం. నారాయణమూర్తి పట్నం చదువు కెడతాడని వాళ్ళింట్లో అంతా మురిసిపోతూ చెప్పుకొంటున్నారు. తన కెందుకో బెంగేసింది. ఇంకెప్పుడూ ఆ ఇంటికి రాకూడదని పట్టు పెట్టుకుంది. ఇంట్లో నిలవబుద్ధి కాలేదు. పెరట్లో బొగడచెట్టుకిందికి వెళ్ళింది. చెట్టుకింద నీడ నిల్చింది. నారాయణ నీళ్ళ గదిలోంచి వచ్చాడు – వుంగరాలజుట్టులోంచి నీటిబొట్లు వీపుమీదకిదిగుతున్నాయి. తను తలవొంచుకోవటంచూసి జడపట్టుకు గుంజి 'ఏం? పెళ్ళికూతుర్లా సిగ్గుపడుతున్నావే!' అని నవ్వాడు. ఆ నవ్వులోంచి నీరెండ పడినట్టు వుంది.

నారాయణ పట్నం వెళ్ళేరోజు నాన్నకి చెప్పేందుకు వచ్చాడు. 'నాన్న జపం చేసుకొంటున్నారు' అన్నా. పెర ట్లోకి వెళ్ళి జామిచెట్టు కొమ్మపైన కూర్చున్నాడు.

ఏదో చెప్పబోయాడు. నాన్న తులిసి కోట దగ్గరకి రావటం చూసి చేతులు దులుపుకుంటూ ఎదురెళ్ళాడు. నారాయణని రోడ్డుదాకా సాగనంపారు ఇంటిల్లిపాదీ.

మళ్ళీ చూడ్డం పడనేలేదు. మరోనెలకి నాన్నకి బదిలీ అయింది. ఆ ఊళ్ళోనే హెూస్పేను నాన్నగారికి వుద్యోగం_అక్కా హెూస్పేను అస్తమానం నవ్వుకునేవారు. అమ్మ కూకలేసేది; అక్క ఎదిరించేది. అమ్మకి చెప్పకుండా హెూస్పేను ఇంటి కెళ్ళేది. మామయ్య వచ్చినరోజు అక్క మాయమైయింది. వో వారం పోయాక మామయ్యతోకలసి బండి దిగింది. మరో బండిలో కాసుయ్యగారి కుటుంబం దిగారు. అమ్మ అక్కతో మాట్లాడలేదు. మామయ్య గారి వూరికి అంతా వెళ్ళటం, బండి సీళ్ళల్లో పడటం గుర్తువచ్చింది. అక్క పెళ్ళిపల్లకీలో వంతెనమీద వూరేగింపు అయి వచ్చే టప్పుడు తన మెళ్ళో పులి గోరు పోవటం, అమ్మకొట్టడం తల్చుకు కళ్ళనీళ్ళు పెట్టుకుంది. మళ్ళీ అతనికేసి చూసింది. ఈసారి తనకేసి చూస్తున్నాడు. తల తిప్పుకుంది. గదిగుమ్మంలో నిల్చు న్నాడు. తన మంచంకేసి వచ్చిన ట్లయింది. తల తిప్పి చూసింది. 'కుటుం బయ్యగారి...' అని వూరుకున్నాడు. తన్ని గుర్తుపట్టాడు. ఏమిటోగావుంది. పాలు పొంగిపోతుంటే దూరంనించి చూసి పడే ఆవేదన గుర్తుకొచ్చింది. గుండెలా వళ్ళంతా కొట్టుకుంటోంది. లేచికూర్చుంది. గాలికి వేళ్ళాడే లైటు వుయ్యాల వూగుతోంది. నీడ కూడా జరుగుతోంది. దీపపునీడ నారాయణ మూర్తి బుగ్గమీద పడి, పొడుగు పొట్టి గీట్లు గీస్తోంది. అప్పటికీ ఇప్పటికీ ఏదో మార్పు చూస్తోంది. ఇప్పుడు బాగా ఎత్తు అయ్యాడు. లావు అప్పుడూ వున్నాడు. రంగు విరిగి పచ్చబడ్డాడు. కీళ్ళ నమిలిన ఎరుపు ఇంకా విడవలేదు పెదాలని. కళ్ళజోడు తుడుచుకు పెట్టుకున్నాడు. వార్డుచివరకి చూస్తూ మళ్ళీ పలకరించాడు: 'ఏమిటి సుస్తీ? మీ ఆయిన్ని మంచివాడిగా వుంచావా?'

సీత తలవంచుకు మెడకేసి చూసు కుంది. పాదాలకేసి చూసుకుంటూ కూర్చుంది. 'పోనీ మీ ఆయన్ని ఎప్పుడు చూపెడతావు?'

ఈసారి 'వెంటనే పెళ్ళికి పిలుస్తాలే' అని సమాధాన మిచ్చింది సీత.

అర్థంకానట్టు కళ్ళ చిట్లించాడు_'పోనీ మా ఆవిడని చూస్తావా' అంటూ దూరంగా వస్తున్న వాళ్ళల్లో ఆతెల్లచీర కట్టుకున్న నల్లపిల్ల, తెల్లచీర కట్టుకున్న ఆవిడ ముందుగా వచ్చింది. తెచ్చిన బుట్ట అందిస్తూ 'ఎల్లావుంది?' అని ప్రశ్న.

నారాయణమూర్తి సమాధానంగా తల వూపాడు 'అల్లాగే వుం' దన్నట్టు.

ముసలావిడ మెల్లిగా ఏడుపు మొదలెట్టింది. 'వయస్సు వచ్చాక ఎక్కువ విచారించకూడదు. ఇప్పుడేం భయంలేదు అనే అంటున్నారు' అని నారాయణమూర్తి వోదారుస్తున్నాడు.

నారాయణమూర్తి భార్య చాలా ఖరీదైన వెంకటగిరి చీర కట్టుకుంది. ఆ తెల్ల జరీచీర ఆవిడకి నప్పలేదు. ఆ చీరలో ఆవిడ మరీ నల్లపడి కాటిక వోడులావుంది సీతకి.

ఆడవాళ్ళు గదిలోకి వెళ్ళారు. నారాయణమూర్తి వాళ్ళవెనకే వెళ్ళినా అప్పుడే తిరిగి వచ్చేశాడు.

'మీ నాన్నగార్ని వోసారి చూడాలి. వుండటం ఎక్కడో' అని, 'ముసలావిడ చాలా మంచిది. ఆయనకితగ్గటం కష్టమే' అన్నాడు డాక్టరు. మాఆవిడకి పెత్తల్లే. ఆవిడగుణం వాళ్ళెవళ్ళకీ రాలేదు.' అని చెప్పేటప్పుడు మొహంలో ఏదోమార్పు దిగులుగా కనిపించింది సీతకి.

నారాయణమూర్తి సీత పక్కకి వచ్చాడు. సీతచూపుల్ని తప్పుకునేందుకా అన్నట్లు'ఏమిటీ?' అంటూ తలనిమిరాడు. వెనక ఎన్నోసార్లు ఆ చేతుల్లో అల్లా వున్నా, అప్పుడు ఇల్లా అనిపించలేదు. ఆ చేతుల్ని తనచేతిలోకి తీసుకు మొహం దాచుకుంది. ఎండిన నేలపైన వానజల్లు పడినప్పుడు తనకెంతో హాయిగా వుంటుంది ఆ వాసన. ఆ చేతుల్లో అంత కంటే మంచి సువాసన_మనస్సుని స్వాధీనము తప్పించింది. పక్క మంచంమీది ముసలమ్మ కళ్ళు పెద్దవిచేసి చూస్తోంది. నారాయణమూర్తి చేతులు విడిపించుకు, 'వస్తా' నంటూ వెళ్ళిపోయాడు.

సీత చాలాసేపు అల్లాగే కూర్చుంది. ఏమిటో కళ్ళు తిరుగుతున్నాయి. గుండెల్లో పొడిచిన ట్లైయింది. కాళ్ళూ, చేతులూ తిమ్మెర్లెక్కుతున్నాయి.

గుండె చేత్తో రుద్దుకుంటూ పక్కకి వరిగింది. సీత మరి సూర్యోదయం చూడలేదు.

కుటుంబయ్య ఇంట్లో వెల్తురుకిముందే శోకం చేరింది.

రామలక్ష్మి ప్రకాశాన్ని శాపనార్థాలు పెట్టింది_పిల్లని చూపెట్టకుండా మాయం చేశా డని, ఆ చెమ్మగారు అందర్నీ తిట్టింది: 'అసలు ఆస్పత్రి కెళ్ళినవాళ్ళు తిరిగొస్తారని అనుకోకూడదుతల్లీ; పిడుగు లాంటివాళ్ళు కూడా పీనుగలే అవుతారు. ఐనా వోనాడేనా తల్లి ఆదరించి గుప్పెడు అన్నం పెట్టిందా? చాకిరీ అంతా దానిదే నాయె. ఇంక చేసుకోక ఏం చేస్తావే తల్లీ' అంటూరామలక్ష్మిని వోదార్పులోనేదెప్పి, కళ్ళు గుచ్చుకుంటూ పెరట్లోకి వెళ్ళింది.

రామలక్ష్మికి ఆవేశం వచ్చింది; తిట్టింది. చుట్టుపక్కలవాళ్ళని తిట్టింది. జుట్టు పీక్కుంది. కామేశ్వరిని పొమ్మంది; అలసి సొమ్మసిల్లింది.

ఆవేశాలు తగ్గి పోతున్నాయి. అంతా సీతని మర్చిపోతున్నారు. కామేశ్వరి పురిటికి వచ్చింది. కుటుంబయ్యలో దుఃఖం జీర్ణించింది. ఎవరిని చూసినా 'ఇంకెన్నాళ్లు ఈ జీవుడికి. సుఖదుఃఖాలు విడిచే క్షణాలు వస్తున్నాయి. మా సీతకి మంచిజన్మే వచ్చివుంటుంది. నాలాంటి తండ్రికి దేవతలు దక్కరు' అంటాడు. మాటపొందిక పోయింది. జీతంరాళ్లు తెస్తాడు; రామలక్ష్మి కివ్వడు. 'సీతపెళ్ళికి మిగుల్చు' అంటూ పళ్ళు కొరుకుతాడు. మళ్ళీ స్తిమితపడి నీరుకావి పంచిలో మొహం దాచుకు ఆవురుమని అందర్నీ హడలగొడతాడు.

కామేశ్వరి తల్లిదగ్గర విసుక్కుంటుంది. రామలక్ష్మి కామేశ్వరిని మరిపిస్తుంది. కుటుంబయ్యతో మాట్లాడేందుకు మనస్సు వప్పక పక్కగదిలోంచి 'జరిగినది కలిసిరాదు. మిగిలినవాళ్ళనేనా వుంచనివ్వరా!' అని నిష్ఠూర పడుతుంది. తల్లిగా తనబాధ మరవాలి అని. ఆ మాటలు ఆదెమ్మ పొంచి వింటుంది. కథలు కడుతుంది. అదేం తల్లో అంటూ దవడలు నొక్కుకుంటుంది. ముక్కుపైన వేలేసుకు 'పెళ్ళిడుపిల్ల—మరొహాళ్లు అవుతే మంచమెక్కరూ; ఆ షోకులు చూడరామా! పెద్దఖాతుదు అంటావా — అదో గ్రంథకర్తలే: అదెందుకు ఇప్పుడు— అంటూ, అడిగినా అడక్కపోయినా వీధి చుట్టి వెళ్ళినచోటంతా వెళ్ళబోస్తుంది. మరోచిత్రం విను: 'చేసే దక్షత లేదుట. ఆ పిల్ల పోయిందన్న అక్కసుతో మందులు మింగిందిట. అదృష్టం బాగుండి పెద్దప్రాణం దక్కింది. వట్టి అఘాయిత్యం మనిషి,' అంటుంది.

సందెవేళ వంటరిగా కూర్చుని రామలక్ష్మి కంటతడి పెట్టుకుంటుంది. ఆదెమ్మ ఆరాటపడుతూ వస్తుంది. కూకలేస్తుంది; కంఠము నెప్పిపుట్టేట్టు మాట్లాడుతుంది. పక్కవాటాల్లోవాళ్లు మొహాలు చూసుకున్నట్లు అనుమానంతో తిడుతుంది. సీతని తలవని వేళలేదు. రామలక్ష్మిని తిట్టని రోజులేదు. తెల్లవారేలోపల ఎన్నో కలలు — హాస్పటల్ నర్సులు, గుమాస్తా మరదలు, అంతా కలిసి సీతని ఏం చేశారు? చిరువెల్తుర్లో సీత కదిలినట్టు వూహిస్తుంది. లేతఆకుల్లో సీతకళ్ళు మెరుస్తాయి. ఎర్రచంద్రకాంతపువ్వుని చూసి సీతనోరు కదిలినట్లుగ వుంటుంది. సన్నని చీరతీగనిచూసి సీతలా భ్రాంతి పడుతుంది. ఏమిటో ఈ బంధం! ఎందుకో ఈ ఆరాటం! మనస్సుని కొప్పడ్డా వినే స్తిమితం పోయింది. అఘాయిత్యం ఆరాటంగా మారింది. ఆత్మీయతగా నిల్చి, ఆదెమ్మ ఆత్మ సీతగా మారి, రామలక్ష్మికి అండగా నిలిచింది. రామలక్ష్మి ఆత్మీయతని మరచి రాయిలా మారి వంటరితనం కోరుతుంది.